

మాట్లాడుతున్న కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు

# అందరి సహకారంతో ఎన్నికల నిర్వహణ

- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు
- రెండో విడుత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి

ఆసిఫాబాద్, నవంబర్ 18 : అందరి సహకారంతోనే ఎన్నికలను నిర్వహణ సాధ్యమవుతుందని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం ఎన్నికల పరిశీలకులు రాహుల్ మహిపాల్, రిటర్నింగ్ అధికారులు దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 01–సిర్పూర్, 05– ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి రెండోవిడుత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు తెలిపారు. పోలింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలింగ్ జరిగే రోజున ఆయా పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా రికార్డింగ్ చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు. ఈ క్రమంలో జిల్లాలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఒక్కో పోలింగ్ కేంద్రానికి నలుగురి చొప్పున సిబ్బందిని కేటాయించినట్లు చెప్పారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు, పోలింగ్ రోజున ఓటర్లు ఇబ్బందులు పడకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమీక్షలో ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# చట్టాలు, ఆర్థిక సాధికారతపై అవగాహన ఉండాలి

- మహిళా సాధికారత కేంద్రం కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సమన్వయకర్త శారద



మాట్లాడుతున్న సమన్వయకర్త శారద

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, నవంబర్ 18 : చట్టాలు, ఆర్థిక సాధికారతపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని మహిళా సాధికారత కేంద్రం జిల్లా సమన్వయకర్త శారద అన్నారు. కలెక్టరేట్ భవన సముదాయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో లైంగిక వేధింపుల నిరోధక, నిషేధ, పరిష్కార చట్టం–2013పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మహిళలు సామాజిక, ఆర్థిక, వ్యవస్థాపక రంగాల్లో రాణిస్తూ, ఆర్థిక స్వావలంభన దిశగా అభివృద్ధి చెందాలని సూచించారు. పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగినులు, మహిళా కార్మికులపై జరుగుతున్న లైంగిక వేధింపులను ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనేందుకు చట్టం గురించి తెలుసుకొని ఉండాలని తెలిపారు. గృహ హింస నిరోధక చట్టం–2005, వివాహ తప్పనిసరి నమోదు చట్టం–2002, వరకట్న నిషేధ చట్టం–1961, గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిరోధక చట్టం–1964 ఇతర చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రస్తుత సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, మహిళ అభ్యున్నతితో కుటుంబం, దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. అనంతరం ఆర్థిక నిపుణులు సాగర్ మాట్లాడుతూ.. మహిళల అభివృద్ధి కోసం బ్యాంకుల ద్వారా అందించే ఆర్థిక చేయూత పథకాలు, బీమా పథకాలు, నెట్ బ్యాంకింగ్, హెల్ప్ లైన్ తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డీహెచ్ఈడబ్ల్యూ అకౌంటెంట్ మమత, మెడికల్ ప్రాజెక్టు అధికారి వినోద్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీఎస్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సకుటుంబ సపరివారంగా..

# బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారం

- ఆసిఫాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి తరఫున కూతురు, చెల్లెలు..
- సిర్పూర్ అభ్యర్థి కోనప్పకు తోడుగా భార్య, కొడుకు..
- ఇంటింటా తిరుగుతూ ఓట్ల అభ్యర్థన..



ఆసిఫాబాద్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మి చెల్లెలు మర్సుకోల సరస్వతి



వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న కోవ లక్ష్మి కూతురు అరుణ

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : ఎన్నికలకు పది రోజులే గడువు ఉండడంతో అభ్యర్థులతో పాటు వారి కుటుంబసభ్యులు కూడా పచారాలు సాగిస్తున్నారు. కుమ్రం భీ ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజవర్గాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులకు తోడుగా వారి కుటుంబ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. సిర్పూర్ అభ్యర్థి కోనేరు కోనప్పకు వారి కుటుంబ సభ్యులు తోడుగా ఉంటూ ప్రచారాన్ని సాగిస్తుంటే.. ఆసిఫాబాద్ అభ్యర్థి కోవ లక్ష్మికి తోడుగా ఆమె కుటుంబ సభ్యులు ప్రచారం చేస్తున్నారు.

### కోనప్పకు తోడుగా కుటుంబ సభ్యుల ప్రచారం..

రాబోయే ఎన్నికల్లో విజయం కోసం కోనేరు కోనప్ప నిత్యం ప్రజల్లో ఉంటూ నియోజకవర్గంలో గ్రామ గ్రామాన తిరుగుతూ ప్రచారం చేస్తుంటే ఆయన తోడుగా కుటుంబసభ్యులు కూడా ప్రచారంలో దూసుకుపోతున్నారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో కోనేరు కోనప్ప పర్యటనలు నిర్వహిస్తూ ప్రజలకు పదేళ్లుగా తాను చేసిన అభివృద్ధిని వివరిస్తుంటే.. కుటుంబ సభ్యులు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి, కుమారుడు కోనేరు వంశీ కూడా ప్రచారాల్లో పాల్గొంటూ కోనప్ప విజయం కోసం కృషిచేస్తున్నారు.

### భర్త విజయం కోసం ఇంటింటా తిరుగుతూ

కోనేరు కోనప్ప విజయం కోసం ఆయన సతీమని కోనేరు రమాదేవి ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. కాగజ్‌నగర్ పట్టణంతో పాటు, గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మహిళలను ఆప్యాయంగా పలుకరిస్తూ బొట్టుపెట్టి ఓట్లు అడుగుతున్నారు. కోనప్ప సాధించిన మూడు సార్లు విజయాల్లో తన వంతు సహకారాన్ని అందించిన రమాదేవి ముచ్చటగా నాలుగోసారి కోనప్ప విజయం సాధించేందుకు నిరంతరం కృషిచేస్తున్నారు. కాగజ్‌నగర్‌లోని వీధుల్లో పర్యటిస్తూ గడపగడపకూ వెళ్తున్నారు.. మహిళలను, పెద్దలను, యువకులను ఆకట్టుకొంటూ తనదైన రీతిలో ప్రచారం సాగిస్తున్నారు. భర్త విజయం కోసం గత నెల రోజులుగా కోనేరు రమాదేవి కాగజ్‌నగర్ పట్టణంలో ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు. రమాదేవి ఏ వాడకు వెళ్లి పెద్ద సంఖ్యలో గుమిగూడి మద్దతు తెలుపుతున్నారు. ఎన్నికల్లో తన తండ్రి కోనేరు కోనప్ప విజయం కోసం కుమారుడు కోనేరు వంశీ రాత్రి పగలు తేడా లేకుండా ప్రచారాలు సాగిస్తున్నారు. ముఖ్యంగా యువతను ఆకట్టుకునేందుకు యువజన సంఘాల నేతలతో, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తూ ప్రచారాలు చేస్తున్నారు. బీఆర్ఎస్‌లోకి పెద్ద ఎత్తున యువతను ప్రోత్సహిస్తున్న వంశీ తన ఆధ్వర్యంలో గ్రామాల్లో యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు..

### కోవ లక్ష్మికి తోడుగా కూతురు, చెల్లెలు ప్రచారం..

ఆసిఫాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మికి తోడుగా ఆమె కూతురు అరుణతో పాటు చెల్లెలు సరస్వతి ప్రచారం సాగిస్తున్నారు. గ్రామాల్లో తిరుగుతూ కోవలక్ష్మి విజయం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కోవలక్ష్మి చెల్లెలు మర్సుకోల సరస్వతి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరడంతో స్థానికంగా బీఆర్ఎస్ బలం మరింత పెరిగింది. కోవలక్ష్మి విజయం కోసం కుటుంబ సభ్యులు నియోజవర్గంలోని మండలాల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్తున్నారు. కోవలక్ష్మికి విజయాన్ని అందించేందుకు కుటుంబసభ్యులు అండగా ఉంటూ ప్రచారాలు చేస్తున్నారు. కోవ లక్ష్మి గత రెండు నెలలుగా నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోను ముమ్మర ప్రచారం చేస్తున్నారు. ఎన్నికల సమయం దగ్గరపడుతున్న కొద్ది కుటుంబసభ్యులు కూడా తోడు కావడంతో బీఆర్ఎస్ ప్రచారం మరింత ముమ్మరంగా సాగుతోంది.





కాగజ్‌నగర్ పట్టణంలో దివ్యాంగుడికి బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను వివరిస్తున్న సిర్పూర్ ఎమ్మెల్యే అభ్యర్థి కోనేరు కోనప్ప సతీమణి రమాదేవి.., మహిళను ఓటు అభ్యర్థిస్తున్న కోనప్ప తనయుడు కోనేరు వంశీ



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

# కొనుగోళ్లు సక్రమంగా జరపాలి

- మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్

మంచిర్యాల అర్బన్, నవంబర్ 18 : 2023–24 వానాకాలం సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరిగేలా చూడాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అధికారులకు సూచించారు. తన ఛాంబర్‌లో శనివారం మండలాల స్పెషల్ ఆఫీసర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేటాయించిన మండలాల్లోని డీఆర్డీఏ ఐకేపీ, పీఏసీఎస్, డీసీఎంఎస్ ఏజెన్సీల పరిధిలోని ప్యాడీ ప్రొక్యూర్‌మెంట్(పీపీ) సెంటర్లను పరిశీలించాలని, నాణ్యతా ప్రమాణాల మేరకు ఆరిన ధాన్యాన్నే తూకం వేసేలా చూడాలని ఆదేశించారు. మిల్లుల్లో లారీలు అన్‌లోడ్ కాకపోవడంతోనే లారీల సమస్య ఎదురవుతుందని, పీపీసీలతో పాటు వాటికి అనుబంధంగా ఉన్న మిల్లుల్లో త్వర త్వరగా లారీలు అన్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ తదితర వసతులు ఉండేలా జాగ్రత్తపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం గెడం గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి కల్పన, జిల్లా మార్కెటింగ్ అధికారి గజానంద్, స్పెషల్ ఆఫీసర్లు, డీఆర్పీ రామస్వామి, డీపీఎం వేణు తదితరులు పాల్గొన్నారు.

### మండల స్పెషల్ ఆఫీసర్లు..

కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశాల మేరకు జిల్లాలోని మూడు ఏజెన్సీల పరిధిలో ఏర్పాటు చేసిన 264 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అదనపు కలెక్టర్ మండలాల వారీగా స్పెషల్ ఆఫీసర్లను నియమించారు. బెల్లంపల్లి, భీమిని, తాండూర్, కాసిపేట, కన్నెపల్లి మండలాలకు డీపీఆర్ఈ జే ప్రకాశ్.., భీమారం మండలానికి పబ్లిక్ హెల్త్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ శ్రీనివాస్.., చెన్నూర్‌కు జిల్లా క్రీడల, యువజన అధికారి బీ శ్రీకాంత్ రెడ్డి.., దండేపల్లికి జిల్లా ఉపాధి అధికారి కే వెంకట రమణ, జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేం కుమార్, హాజీపూర్‌కు జిల్లా భూగర్భ జల అధికారి పీ శ్రీనివాస బాబు.., జైపూర్‌కు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ గెడం గోపాల్.., జన్నారంకు జిల్లా మైనింగ్ అధికారి బాలు నాయక్.., కోటపల్లికి జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి పీ రవీందర్ రెడ్డి.., లక్షెట్టిపేటకు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, జిల్లా వయోజన విద్యా అధికారి ఏ పురుషోత్తం.., మంచిర్యాల, మందమర్రి, నస్పూర్ మండలాలకు జిల్లా బీసీ డెవలప్‌మెంట్ అధికారి బీ వినోద్ కుమార్.., నెన్నెల మండలానికి జిల్లా మార్కెటింగ్ అధికారి వై గజానంద్.., వేమనపల్లి మండలానికి సర్వే, ల్యాడ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాస్‌ను నియమించారు.

### కంట్రోల్ రూం ప్రారంభం..

మంచిర్యాల అర్బన్, నవంబర్ 18 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లోని జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయంలో కంట్రోల్ రూంను అదనపు కలెక్టర్ ప్రారంభించారు. గోనె సంచులు, లారీల సమస్యతో పాటు మిల్లుల వద్ద ఏవైనా ఇబ్బందులు ఉంటే కంట్రోల్ రూం(63039 28682)కు ఫిర్యాదు చేయాలని సూచించారు. 24/7 అందుబాటులో ఉంటారని, రిజిష్టర్‌లో ఫిర్యాదులను నమోదు చేస్తారన్నారు. అలాగే ఫిర్యాదులను ఏ రోజుకారోజు సంబంధిత శాఖ అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు.